


బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 106 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ ఆదివారం 24 -11-2024 వెల: 5/రూ -




## వయనాడ్‌లో ప్రియాంకకు పట్టం

అన్న రాహుల్ గాంధీ రికార్డును దాటి 4.1 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం

2లో



## హేమంత్- కల్పన జయకేతన.. జంట!

భర్తకు బాసటగా భార్య.. బీజేపీ నుంచి అవమానాలు.. బంటీ-బబ్లీ అంటూ విమర్శలు

# బీజేపీ 'మహా' విజయం

### బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విజయోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ

### మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం.. మహాయుతికి 80% పైగా సీట్లు


- మరాఠా గడ్డపై 90% స్ట్రైక్‌రేట్‌తో బీజేపీ సునామీ
- మహాయుతిని గట్టెక్కించిన ఎన్నికల ముందు పథకాలు
- మహిళలు, రైతులు, మరాఠాలు, యువత ఓటు దానికే
- దేవేంద్ర ఫడణవీసే సీఎం.. డిప్యూటీగా శిందే?
- రేపు బీజేపీఎల్పీ భేటీ.. 26న కొత్త సీఎం ప్రమాణం
- కాంగ్రెస్ నేతృత్వంలోని ఎంవీఏకు ఘోర పరాభవం
- శాసనసభలో ప్రతిపక్ష పార్టీ హోదాకూ దూరమే
- ప్రధాన పార్టీలుగా శివసేన, ఎన్సీపీ చీలిక పక్షాలు
- ముగిసిన శరద్ పవార్ శకం.. ఉద్ధవ్ థాక్రే దారెటు!?
- మజ్లిస్ ఒక చోట గెలుపు.. 4 చోట్ల ద్వితీయ స్థానం
- వందేళ్ల కాంగ్రెస్ పార్టీ.. మరాఠా యోధుడు





మహారాష్ట్రపై కాషాయజెండా నిండుగా రెపరెపలాడింది. హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరులో బీజేపీ సారథ్యంలోని మహాయుతి ఘనవిజయం సాధించింది. ఏకంగా నాలుగింట మూడొంతుల సీట్లు ఒడిసిపట్టింది! అధికార కూటమి దెబ్బకు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి కకావికలమైంది.

ప్రధాన ప్రతిపక్ష హోదాకు కావాల్సిన 29 స్థానాలు విపక్షాల్లో ఏ పార్టీకీ దక్కకపోవడం విశేషం. అయితే, మహారాష్ట్రలో తలబొప్పి కట్టిన విపక్ష ఇండియా కూటమికి జార్ఖండ్ ఫలితాలు ఊరటనిచ్చాయి. జేఎంఎం సారథ్యంలోని ఇండియా కూటమి హోరాహోరీ పోరులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని నిలువరించి అధికారాన్ని నిలబెట్టుకుంది.




2లో

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహా యుతి కూటమి అఖండ విజయం సాధించింది. 288 సీట్ల అసెంబ్లీలో నాలుగింట మూడొంతులకుపైగా స్థానాల్లో ఘన విజయం దక్కించుకుంది. కూటమిలోని బీజేపీ 149 స్థానాల్లో బరిలోకి దిగి ఏకంగా 132 స్థానాల్లో గెలిచింది. అంటే.. దాదాపు 90 శాతం విజయాన్ని (స్ట్రైక్ రేట్) సాధించింది. ఇక, కూటమిలోని ఏక్‌నాథ్ శిందే శివసేన పార్టీ 81 స్థానాల్లో పోటీ చేసి 57 సీట్లను దక్కించుకుంటే.. అజిత్ పవార్ ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేసి 41 సీట్లలో విజయం సాధించింది! ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాఢీ (ఎంవీఏ) కూటమి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది!



కొడంగల్‌లో ఫార్మాసిటీ కాదు..

## పారిశ్రామిక కారిడార్

- నా ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడతా..?
- వామపక్ష పార్టీల నాయకులతో సీఎం రేవంత్
- డిసెంబరు 1 – 9 వరకు ఏడాది సంబరాలు
- 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో భారీ సభ
- పలువురికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత
- 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- 30న పాలమూరులో రైతుల అవగాహన సదస్సు
- హైదరాబాద్‌కు 20 టీఎంసీల గోదావరి జలాలు
- 1న టెండర్లకు వెళ్లాలి.. అధికారులతో భేటీల్లో సీఎం
- రాష్ట్రంలో 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెల్లడించిన అధికారులు


హైదరాబాద్, నవంబరు 23 : కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టతనిచ్చారు. అక్కడ ఏర్పాటు చేసే ది పారిశ్రామిక కారిడారేనని, ఫార్మా సిటీ కాదని తేల్చిచెప్పారు. కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తా మన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా ని యోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని, అక్కడి యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమని తెలిపారు. "నా సొంత నియోజకవర్గ ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడ తాను?" అని ప్రశ్నించారు. శనివారం సచివాలయంలో తనను కలిసిన వామపక్ష పార్టీల నేతలతో

(మిగతా 2వ పేజీలో)

## వైసీపీ హయాంలో విచ్చలవిడిగా భూ కబ్జాలు


### జగన్ పార్టీలో లెక్కకు మించి భూ రాబందులు

### కబ్జాదారుల దుర్మార్గాలను అడ్డుకోవడానికే కొత్త చట్టం: టీడీపీ



అమరావతి, నవంబరు 23 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టం వల్ల భూములు కబ్జా చేసేవారికి కఠిన శిక్షలు పడతాయని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన భూ కబ్జాదారుల దుర్మార్గాలను అడ్డుకోవడానికే కొత్త చట్టం వచ్చిందని ఆ పార్టీ వ్యాఖ్యానించింది. శనివారం ఇక్కడ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య విలేకరులతో మాట్లాడారు. "కొత్తగా తెచ్చిన భూ దురాక్రమణ నిరోధక చట్టం ప్రకారం భూములు కబ్జా చేస్తే పది నుంచి 14 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు భారీ జరిమానాలు పడతాయి. అధికారులు ఎవరైనా దీనికి సహకరిస్తే వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవడంతోపాటు ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడుతుంది. పేదలు, సామాన్యుల భూములకు రక్షణ కల్పించడానికే కూటమి ప్రభుత్వం ఈ చట్టం తెచ్చింది. జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం నలుమూలలా భూ కబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రికి రాత్రి భూమి రికార్డులు మార్చివేసి భూములు కొట్టేశారు. ఉత్తరాంధ్రలో

(మిగతా 2వ పేజీలో)



## మహారాష్ట్ర ప్రగతి పథాన్ని ఎన్నుకుంది

మహాయుతి విజయంపై పవన్ హర్షం

ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయం

2లో



## రేవంత్ ప్రచారం పనిచేయలేదు

కాంగ్రెస్ అబద్ధాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు: కిషన్‌రెడ్డి

# కొడంగల్‌లో ఫార్మాసిటీ కాదు.. పారిశ్రామిక కారిడార్

సీఎం రేవంత్ పై విధంగా వ్యాఖ్యానించారు. సేకరిస్తున్న భూములకు అందించే పరిహారాన్ని పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. లగచర్ల ఘటనలో కుట్ర చేసిన వారిని వదిలిపెట్టబోమన్న సీఎం.. ఈ ఘటనలో రైతులపై నమోదైన కేసుల విషయాన్ని పరిశీలిస్తామన్నారు. కాగా లగచర్ల ఘటన, అనంతర పరిణామాలపై సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు సహా పలువురు వామపక్ష నేతలు సీఎంకు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో అధికారం చేపట్టి డిసెంబరు 7నాటికి ఏడాది అవుతున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం సాయంత్రం సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలన్నారు.

**4న పెద్దపల్లిలో సభ..**

తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతోపాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. డిసెంబరు 4న పెద్దపల్లి జిల్లాల్లో యువతతో విజయోత్సవ సభ జరపాలని నిర్ణయించారు. అదే వేదికగా గ్రూప్-4తోపాటు వివిధ పోస్టులకు ఎంపికైన 9వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇక డిసెంబరు 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. డిసెంబరు 9న సచివాలయం ముఖద్వారం ఎదుట ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం నిర్ణయించారు. ఆరోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉ ద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని సూచించారు.

**శాఖలవారీగా ప్రగతి నివేదికలు..**

డిసెంబరు 1 నుంచి శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులకు సీఎం సూచించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలన్నీ ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. తమ శాఖల వారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతోపాటు భవిష్యత్తు ప్రణాళికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. డిసెంబరు 7 నుంచి మూడు రోజులపాటు సచివాలయ పరిసరాలు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిర్టిసలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



మూడురోజులపాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టిపడే కార్యక్రమాలతోపాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, డ్రోన్ షోలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సును 28 నుంచి మూడు రోజులపాటు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని రైతులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. దీనిని బహిరంగ సభలా కాకుండా వ్యవసాయ రంగంలో రైతులకు అవగాహన కలిగించేలా అవగాహన సదస్సుగా నిర్వహించాలని సూచించారు. ఈ అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో రేవంత్ సమావేశమయ్యారు.

**హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీలు**

హైదరాబాద్ నగరం తాగునీటి అవసరాల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి 20 టీఎంసీల గోదావరి నీటి తరలింపునకు సంబంధించి సమగ్ర నివేదిక తయారు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుందనే వివరాలతోపాటు నీటి లభ్యతపై అధ్యయనం చేయాలన్నారు. డిసెంబరు 1న టెండర్లకు వెళ్లేలా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మరోమారు పరిశీలించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం విగ్రహ పనుల వద్దకు వెళ్లారు.

# వయనాడ్‌లో ప్రియాంకకు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: అన్న రాహుల్ గాంధీని వరుసగా రెండుసార్లు గెలిపించిన వయనాడ్ ప్రజలు.. ఇప్పుడు ఉప ఎన్నికలో చెల్లెలు ప్రియాంకా గాంధీకి భారీ విజయం చేకూర్చారు. రాహుల్ రికార్డును దాటి 4.1 లక్షల ఓట్ల మెజారిటీతో ఆమెకు పట్టం కట్టారు. రెండు దశాబ్దాల క్రితం గాంధీ-నెహ్రూ కుటుంబం వారసురాలిగా రాజకీయాలకు పరిచయమైన ప్రియాంక.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. తల్లి సోనియాగాంధీ రాజ్యసభ సభ్యురాలు. రాహుల్ వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి గెలిచి.. వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. అక్కడ నుంచి ప్రియాంక గెలుపుతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు ఎంపీలు ఎన్నికైనట్టు అయింది. ప్రేమాభిమానాలు కురిపించి.. తనకు విజయం అదించిన వయనాడ్ ప్రజలకు ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం 2004లో ప్రియాంక తొలిసారి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2019 జనవరిలో ఆమె ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది మొత్తం యూపీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2022లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచార బాధ్యతలను తీసుకుని.. రాష్ట్రమంతటా పర్యటించి ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందినా ప్రియాంక ప్రచారం మాత్రం మెప్పించింది.


## హేమంత్- కల్పన జయకేతన.. జంట!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని అంటారు. ఝార?ండ్‌లో జేఎంఎం అప్రతిహత విజయం వెనుక, మరీ ముఖ్యంగా సీఎం హేమంత్ సోరెన్ గెలుపు వెనుక ఆయన సతీమణి కల్పనా సోరెన్ నిర్వహించిన పాత్ర ఎనలేనిదనడంలో సందేహం లేదు. గిరిజన మహిళలను తమవైపు తిప్పుకోవడంలో ఈ జంట పడిన కష్టం ఓట్ల రూపంలో ఫలితాన్నిచ్చింది. ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి సూటి పోటి మాటలు తూటాల్లా తగిలినా, బంటీ-బబ్లీ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించినా, 'హెలికాప్టర్ మేడమ్' అని కమలనాథులు ఎద్దేవా చేసినా కల్పనా సోరెన్.. తన భర్తను మరోసారి సీఎంగా చూడాలన్న పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ప్రచార బాట పట్టారు. ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల దాకా ప్రజల మధ్యే ఉన్నారు. తన భర్తను ఈడీ అరెస్టు చేసిన విధానం, జైల్లో పెట్టిన తీరు గురించి ప్రజలకు వివరించి, సానుభూతిని ప్రోది చేశారు. గిరిజనులకు ప్రభు త్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, మరోసారి హేమంత్ సీఎం అయితే.. ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. వారి ఓట్లను అ నుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతులయ్యారు. మనీ లాండరింగ్ కేసులో సీఎం హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ ఏడాది జనవరి 31న అరెస్టు చేసింది. అప్పటి వరకూ ఇంటి పట్టునే ఉన్న ఆయన సతీమణి కల్పనా సోరెన్.. బయటికొచ్చి రాజకీయాల బాటపట్టారు. తన భర్తను అన్యాయంగా అరెస్టు చేశారని, అక్రమ కేసులు బనాయించారని అప్పటి నుంచే ప్రజలకు వివరించడం ప్రారంభించారు. సీబీఐ, ఈడీ కేంద్రం చేతిలో కీలుబొమ్మలుగా మారాయని.. బీజేపీని వ్యతిరేకించే పార్టీలపై వాటిని ప్రయోగిస్తున్నారని.. నిప్పులు చెరిగారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఆమె కూడా రంగంలోకి దిగి.. మొత్తం 200కు పైగా ప్రచార సభల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా గిరిజనుల ఆత్మగౌరవ నినాదాన్ని ఎక్కువగా వినిపించారు. హేమంత్, కల్పనలు ఇరువురూ అలుపెరుగని ప్రచారం చేశారు.

# వైసీపీ హయాంలో విచ్చలవిడిగా భూ కబ్జాలు

వైసీపీ మాజీ మంత్రి బొత్స కుటుంబం 2,000 ఎకరాల భూమిని కొట్టేసిందన్న ఆరోపణలు వచ్చాయి. అనంతపురం జిల్లాలో మాజీ మంత్రి ఉషా శ్రీ చరణ్ రూ.30 కోట్ల విలువైన 160 ఎకరాల భూములను కొట్టేసి తన భర్త పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే... 'గుడ్‌మార్నింగ్' అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొంటూ మరో పక్క భూములు మింగేశారు. ఇటువంటి భూ రాబందులకు వైసీపీలో లెక్కే లేదు. వీరి చేతుల్లో చిక్కుకొన్న భూములను వెనక్కు తీసుకోవడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. సామాన్యుల హక్కులను కాపాడాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇన్ని దుర్మార్గాలు చేసి కూడా జగన్‌రెడ్డి ఇంకా అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించాలని ప్రయత్నం చేస్తున్నారు" అని ఆనంద్ సూర్య విమర్శించారు.



## చిన్న వెంకన్న ఆలయంలో ఈ దోపిడీని ప్రశ్నించే వారే లేరా?

రొటేషన్ పద్ధతిలో వీరు ఆ కుర్చీ ఎంచుకుని తెచ్చుకుని డ్యూటీలూ ఏరి కోరి ఏపించుకోవడం ... అలాగే డ్యూటీ వేయటం జరుగుతుంది... ఆ డ్యూటీ ఏపించిన అధికారికి.. కొంత సొమ్ము ముట్టజెప్పడం జరుగుతుంది... ఎందుకంటే ఆ కుర్చీలో లక్షల్లో సంపాదన వస్తుంది... అలాగా ఆ డ్యూటీ వేసే వ్యక్తి ఏళ్ల తరబడి అదే సీటులో ఉండటం వలన ....మిగతా ఉద్యోగస్తులు అన్యాయం జరుగుతుంది... ఈ దేవాలయంలో పర్మినెంట్ ఎంప్లాయేమో ఒక అటెండర్ గాను.... ఈయనకు నచ్చిన వ్యక్తి అయితే లక్షల్లో సంపాదించే సీటు.. వేయడం జరుగుతుంది... ఇవి అన్ని తెలియని చైర్మన్.ఆయనకు తెలియజేద్దాము అంటే.... ఆ చుట్టుపక్కల అంతా ( చైర్మన్ వస్తే ఆయన దగ్గర వీరే ఉంటారు) ఇప్పటికైనా ఈ సంస్కృతికి ముగింపు పలకాలని దేవస్థానం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు....

# బీజేపీ 'మహా' విజయం



కూటమిలోని మూడు పార్టీలకు వచ్చిన సీట్లను కలిపినా అర్ధ సెంచరీ దాటలేదంటే కాషాయ సునామీని అర్థం చేసుకోవచ్చు! ఇక, ఈసారి ఫలితాల్లో కాంగ్రెసకూ కొంత ఊరట దక్కింది. జార్ఖండ్ లో ఆ పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి మరోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించారు! ఝార?ండ్‌లో వరుసగా రెండోసారి కాంగ్రెస-జేఎంఎం కూటమి ఘన విజయం సాధించింది. 81 సీట్ల అసెంబ్లీలో ఈ కూటమి గత ఎన్నికల్లో 47 సీట్లను సాధిస్తే.. ఈసారి 56 సీట్లను సాధించడం విశేషం. నిజానికి, సీఎం హేమంత్ సోరెన్‌ను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేసినా.. నాన్ లోకల్ వివాదాన్ని తెరపైకి తెచ్చినా.. కుటుంబంలో చీలిక తెచ్చి చంపయీ సోరెన్‌ను ఆకర్షించినా ఇక్కడి ప్రజలు హేమంత్ సోరెన్ వైపునకే మొగ్గు చూపారు. ఇక, ఉప ఎన్నికల్లో ఎప్పట్లాగే అధికార పార్టీలే పైచేయి సాధించినా.. అక్కడక్కడ ప్రతిపక్షాలూ మెరుపులు మెరిపించాయి! ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట ఏదైనా ఉందంటే అది వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ అద్భుత విజయమే. గత ఎన్నికల్లో రాహుల్ ఇక్కడ 3.64 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తే.. ప్రియాంక అరంగేట్రంతోనే 4.10 లక్షల ఓట్ల ఆధిక్యాన్ని సాధించి లోక్‌సభలో అడుగు పెడుతున్నారు. గాంధీ కుటుంబం నుంచి పార్లమెంటుకు వెళుతున్న మరో వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఇక, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీలే పైచేయి సాధించాయి. చివరిగా, మహారాష్ట్రలో మహా యుతిబీ జార?ండ్‌లో ఎంపీఏ విజయం సాధిస్తాయన్న ఎగ్జిట్ పోల్స్‌అంచనాకు మించి విజయం సాధించడం విశేషం!! ఇక, శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్లు.. వివిధ రాష్ట్రాల్లో తన వ్యూహాలతో పార్టీలను గెలిపిస్తున్నానని చెప్పుకొనే ప్రశాంత్ కిశోర్ పార్టీ బిహార్లో కనీసం డిపాజిట్లను కూడా దక్కించుకోలేదు!!

**దేవేంద్రుడు మూడోసారి పీఠం చేపట్టేనా!?**

ఇప్పుడు అందరి మదిలోనూ మెదులుతున్న ప్రశ్న.. మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనే! అత్యధిక సీట్లు గెలిచిన బీజేపీకే ఈసారి ముఖ్యమంత్రి పీఠం దక్కుతుందనే అంచనాలున్నాయి. అందులోనూ ఆ పార్టీని విజయ తీరాలకు చేర్చిన ఫడణవీస్ మూడోసారి ఆ పదవిని చేపడతారనే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. దీనికితోడు, శిందే సహాయం లేక పోయినా అధికారం చేపట్టే స్థితిలో ఇప్పుడు బీజేపీ ఉంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఫడణవీస్ సీఎం అవుతారని, సీఎం శిందే డిప్యూటీ అవుతారనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వెలువడుతున్నాయి. ఇక, ఈ ఎన్నికలతో మరాఠా యోధుడు శరద్ పవార్ శకం ముగిసినట్లే! శివసేనతోపాటు ప్రజా బలాన్ని కూడా శిందే కూడగట్టుకోవడంతో ఉద్ధవ్ ఠాక్రే రాజకీయాలకూ కాలం చెల్లినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, చీలిక పార్టీలే అక్కడ ప్రధాన పార్టీలుగా చక్రం తిప్పనున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది! అక్కడ ఏకంగా 48 లోక్‌సభ సీట్లు ఉంటే బీజేపీకి తొమ్మిదికే పరిమితమైంది. దాంతో, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎంవీఏ పైచేయి సాధిస్తుందనే అంచనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బీజేపీ-శిందే సర్కారు అప్రమత్తమైంది. అందరూ ఎన్నికల ప్రచారంలో హామీలు ఇస్తారు. కానీ, మహా యుతి సర్కారు మాత్రం ఎన్నికలకు ముందే తాయిలాలు పంచేసింది. లాడ్కి బహిన్ యోజనను ప్రవేశపెట్టి.. రూ.2.5 లక్షల వార్షికాదాయం ఉండే మహిళలకు నెలకు రూ.1500 ఇస్తోంది. మళ్లీ అధికారంలోకి వస్తే దీనిని రూ.2100 చేస్తామని ప్రకటించింది! దాంతో, తాము అధికారంలోకి వస్తే ఈ పథకం కింద రూ.3000 ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించినా మహిళలు మహా యుతికే జైకొట్టారు! అలాగే, లడ్కా బౌ అనే మరో పథకం కింద నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణ సమయంలో స్టైపెండ్‌నూ ఇస్తోంది. ముంబై నగరం చుట్టూ ఉన్న ఐదు టోల్ గేట్ల ద్వారా ప్రవేశాన్ని ఉచితం చేసేసింది. ఎగుమతులపై నిషేధంతో ఉల్లి రైతుల్లో ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఆ నిషేధాన్ని తొలగించింది.

## రేవంత్ ప్రచారం పనిచేయలేదు

**కాంగ్రెస్ అబద్ధాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు: కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, నవంబరు 23 : మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం పనిచేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కోసం రేవంత్, తెలంగాణ ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలుచేసి మహారాష్ట్ర పంపించినా.. అది కూడా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అనేక రకాల తప్పుడు ప్రచారం చేసినా అక్కడి ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంలోని డబు ల్ ఇంజన్ సర్కార్‌కే అత్యధిక ఓట్లు, సీట్లతో మరోసారి పట్టం కట్టారని చెప్పారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోతాయని, మరాఠీలకు అన్యాయం జరుగుతందని లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసి కొంత లబ్ధి పొందారు. కానీ, 5 నెలల్లోనే ప్రజలకు వాస్తవం అర్థమైంది. ఇంత పెద్ద విజయం అందించార'ని చెప్పా రు. రాహుల్ చిలకపలుకులకు, రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని చేసుకుని అసత్య ప్రచారాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. ప్రజాతీర్పును గౌరవించకుం డా కాంగ్రెస్ నేతలు ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ విమర్శించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

**కాంగ్రెస్ కుట్రలను గుర్తించారు: డీకే అరుణ**

కాంగ్రెస్ కుట్రలు, తప్పుడు ప్రచారం మహారాష్ట్ర ఎన్నికల్లో పనిచేయలేదని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే సెంటిమెంట్ రాజకీయాలను కాంగ్రెస్ చేసిందని ఆమె ఆరోపించారు.

## మహారాష్ట్ర ప్రగతి పథాన్ని ఎన్నుకుంది

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి, నవంబరు 23 : మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమికి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ ఘన విజయం ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వంపై మహారాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. మహాయుతి అభ్యర్థులకు మద్దతుగా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. మహారాష్ట్రలోని తెలుగువారి అభివృద్ధి, సంక్షేమం కోసం కొత్త ప్రభుత్వం కృషి చేయాలని, మహారాష్ట్ర-ఏపీ మధ్య పరస్పర సహకారాన్ని కొనసాగించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి మద్దతుగా ప్రచారం చేసిన అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. దేగ్లూర్, భోకర్, లాతూర్, షోలాపూర్ నగరంలోని మూడుస్థానాలు, బల్లార్‌పూర్, చంద్రాపూర్, పుణె కంటోన్మెంట్, హడ్సర్‌పూర్, కస్బాపేట్ నియోజకవర్గాల్లోని మహాయుతి అభ్యర్థులను గెలిపించాలని పవన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో అన్నింటా విజయం దక్కడంతో మరోసారి 100 శాతం స్ట్రైక్‌రేట్ అందుకున్నారు. లాతూర్ సిటీ, దేగ్లూర్ అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ తొలిసారి విజయం సాధించడం గమనార్హం.



## చేవెళ్లలో బీజేపీ నేతల సంబరాలు

శంకర్‌పల్లి: నవంబర్ 23: (డైలీ రిపోర్ట్): మహారాష్ట్రలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంతో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం ఆధ్వర్యంలో చేవెళ్లలో శనివారం బానసంచకాల్చి, నేతలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ కూటమిని ప్రజలు తిరస్కరించారని, మరోసారి ఎన్డీఏ కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి మండల, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కబ్జాచేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం

**నిరాధార అసత్య వార్తా కథనాలను వెలువడించకండి వాస్తవాలను ప్రసారం చేయాలి ,**

**కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని వార్తా కథనాలను ఆమె తీవ్రంగా ఖండించారు**

**అమీన్ పూర్ తాసిల్దార్ రాధా**



**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 23:(డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండల పరిధిలోని సుల్తాన్ పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 30లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మీడియాలో వస్తున్న కథనాలపై తహశిల్దార్ రాధా తీవ్రంగా స్పందించారు. వాస్తవాలను వక్రీకరించి కబ్జాలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని చేస్తున్న ప్రచారాన్ని తహశిల్ధార్ రాధా ఖండించారు సర్వే నంబర్ 30లోని 722 ఎకరాల ఇనామ్ భూములలో 242 ఎకరాలకు ఓ ఆర్ సి ఉందని , మిగతా 384 ఎకరాల పాన్ మాఖతా ఇనామ్ భూమి ప్రభుత్వానికి అసలు ఇనాంధార్లకు న్యాయస్థానంలో వివాదాల్లో ఉందని తేల్చిచెప్పారు . సర్వే నంబర్ 30లో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశిల్ధార్ రాధా హెచ్చరించారు. ఏ విధమైన ఆధారాలు చూపకుండా మీడియా కథనం ప్రచురించడం చాలా బాధాకరం మీడియా అంటే అధికారులకు ప్రజలకి మధ్య వారధిగా పని చేయాలి తప్ప అసత్య ప్రచారాలను నిరాధారమైన పత్రికా కథలను ప్రచురించవద్దని ఇలాంటి వార్తా కథనాలు పాత్రికేయ మిత్రులు వ్రాయడం సరైనవి కాదని ఆమె అన్నారు అలాగే సుల్తాన్పూర్ లో 30 సర్వే నెంబర్ లో 722 ఎకరాలు దాంట్లో 242 ఒరిజినల్ రైతులు ఎవరైతే ఉన్నారో వాళ్లకు ఓఆర్సి వచ్చింది, తర్వాత 384 ఎకరాలు అసలు ఇనామ్ దారులకు ప్రభుత్వానికి మధ్యలో కోర్టు వివాదం ఉందని అన్నారు. ఇట్టి కబ్జాల విషయమై తమ దృష్టికి రాగా ఆర్ ఐ సెప్టెంబర్ 21 2024 లో మోకాపైకి వెళ్లి అక్కడ జరుగుతున్నటువంటి పనులను నిలిపివేయడం జరిగింది వాటికి సంబంధించిన ఫొటోస్, వీడియోస్ కూడా పాత్రికేయ మిత్రులకు అందజేశారు తర్వాత సెప్టెంబర్ 21.11.2024 రెవెన్యూ పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా వెళ్లి అక్కడ ఉండేటువంటి జెసిబిల సహాయంతో చేస్తున్నటువంటి పనులను కూడా నిలిపివేయడం జరిగింది అక్కడ నిర్మించినటువంటి చిన్న చిన్న నిర్మాణానికి కూడా కూల్చివేయడం జరిగిందని తెలిపారు తర్వాత నవంబర్ 16వ తారీకు మేము అమీన్ పూర్ ఎస్ హెచ్ ఓ గారికి లేక రాయడం జరిగింది. 16.11.2024 రోజు లెటర్ రాశాము. 19.11.2024 కి 30 సర్వే నెంబర్లు నిర్మించిన అటువంటి అక్రమ కట్టడాలను కూల్చి వేయడానికి మాకు బందోబస్తు ఏర్పాటు చేయవలసిందిగా వారిని కోరాము అక్కడ జరుగుతున్నటువంటి అక్రమ నిర్మాణం పై ప్రణాళికా పరంగా చర్యలు తీసుకోవడానికి మేము ప్రణాళికను సిద్ధం చేసుకోగా మీడియా మిత్రులు కొందరు కలెక్టర్, ఎమ్మార్వో కబ్జాలకు సహకరిస్తున్నారని తప్పుడు కథనం ప్రచారం చేశారు. అది వాస్తవం కాదు అని చెప్పడానికి మీడియా సమావేశం ఏర్పాటు చేశామని అమీన్పూర్ తాసిల్దార్ రాధా తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రఘునాథ్ రెడ్డి కూడా ఉన్నారు.



## రోడ్డు పై మట్టి కుప్పలు వేసి రోజులు గడుస్తున్నా పట్టించు కొని అధికారులు

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో ఇబ్బందులు పడుతున్న వాహన దారులు**

**సంగారెడ్డి :(డైలీ రిపోర్ట్ )23:** నవంబర్ సంగారెడ్డి పట్టణం లోని మల్కాపూర్ రాజంపేట రోడ్డు ఇందిరా కాలనీ వద్ద రోడ్డు కు ఇరువైపులా గుంతలు పుడ్చడానికి మట్టి వేసి రోజులు గడుస్తున్నా. అధికారుల పర్యవేక్షణ లోపం కారణం తో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నాడు. రోడ్డు పై వేసిన మట్టికరణంగా రోడ్డు పై రాకపోకలు చేసే వాహనాలకు ప్రయాణికులకు ఇబ్బందిగా మరి ప్రమాదం జరిగితే ఎవరిబాధ్యత అని స్థానికులు అధికారుల తీరు పై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వెంటనే ఉన్నత అధికారులు స్పందించి రాజంపేట రోడ్డు పై వేసిన మట్టిని రోడ్డుకు ఇరువైపులా పూడ్చిలా సంబందించిన అధికారులకు ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు.

## మోడీ నాయకత్వానికి అండగా మహారాష్ట్ర

**ఎన్నికల ఫలితాలపై కిషన్ రెడ్డి**

**హైదరాబాద్:** ఏ ఎన్నిక జరిగినా బీజేపీదే విజయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ నాయకత్వానికి అండగా నిలిచినందుకు మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మహావికాస్ అఘాడీ కూటమి విద్వేషాలు ప్రచారం చేశారని విమర్శించారు. ఎంవీఏ కూటమిని ప్రజలు నమ్మలేదన్నారు కిషన్ రెడ్డి. మహరాష్ట్ర ప్రజలు వారసత్వం చూడలేదన్నారు మహారాష్ట్రలో ఎన్డీయే కూటమికి ఓట్లు, సీట్లు భారీగా పెరిగాయన్నారు కిషన్ రెడ్డి. శరద్ పవార్ శకం ముగిసిందన్నారు. కాంగ్రెస్ కులం,మతం పేరుతో ప్రచారం చేసిందని.. మహారాష్ట్ర, జార్కండ్ లో కలిపి కాంగ్రెస్ కు 30 సీట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు కిషన్ రెడ్డి. కాంగ్రెస్ పై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు.ంఒ-ఃూక్ష ఖీఇంఆ । మహారాష్ట్రలో సీఎం ఈవీఎం కుట్ర అంటూ కాంగ్రెస్ కూటమి నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు కిషన్ రెడ్డి. సంజయ్ రౌత్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఓడిపోయినప్పుడు ఈవీఎంలపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. కర్ణాటక, జార్ఖండ్, తెలంగాణలో గెలిచినప్పుడు ఈవీఎంలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు కిషన్ రెడ్డి.



## శ్రీ సత్య సాయి బాబా జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా వైఎస్ఆర్సిపి మాజీ రాష్ట్ర నాయకులు డప్పు రాజు

**పటాన్ చెరువు/నవంబర్ 23:** పటాన్చెరు నియోజకవర్గం ,,,,శనివారం నాడు సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు పట్టణంలోని శ్రీ సత్యసాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆ వేడుకలలో మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు డప్పు రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. చిన్నపిల్లలు ఆటపాటలతో నృత్యాలతో అలరించి ఆనందోత్సవా లతో శ్రీ సత్య సాయి బాబా జన్మదిన వేడుకలు ఘనంగా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

## ప్రియాంక గాంధీకి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ శుభాకాంక్షలు



**శంకర్‌పల్లి నవంబర్ 23 (డైలీ రిపోర్ట్):** వయనాడ్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ 4 లక్షలకు పైగా మెజార్టీతో గెలుపుపొందారు. దీనిపై దేశ వ్యాప్తంగా ప్రియాంకకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్ శనివారం ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు. వయనాడ్ ప్రజలు రాహుల్ గాంధీకి మించి ప్రియాంక గాంధీకి రికార్డు మెజారిటీ కట్టబెట్టారని, కాంగ్రెస్ తో పాటు గాంధీ కుటుంబానికి అండగా నిలబడ్డారని హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపరచాలి

**ఎంపీడీవో వెంకయ్య గౌడ్, స్పెషల్ ఆఫీసర్ సురేష్**





**శంకర్‌పల్లి నవంబర్ 23:(డైలీ రిపోర్ట్):** ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపరచాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్, స్పెషల్ ఆఫీసర్ సురేష్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె ఆసుపత్రులు మెరుగుపరచాలని సూచించారు. పని గంటలలో అందుబాటులో ఉండాలన్నారు. సిజేరియన్స్, సి సెక్షన్ తగ్గించాలి. అన్ని రకాల మందులు వాడాలి. యాంటీబయాటిక్స్ వాడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.





# విద్యార్థులకు అత్యుత్తమమైన బోధనలు అందించాలి

**అభ్యసన స్థాయిలు మెరుగుపడే విధంగా అందరూ కృషిచేయాలి**

**ఎస్ ఎస్ సి లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి**

**విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి**

**సానిటేషన్, త్రాగునీరు, విద్యుత్ సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్, నవంబర్ 23(డైలీ రిపోర్ట్):** సమాజంలో మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఎస్ ఎస్ సి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం ఉండేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలలు,వసతి గృహాలలో రుచికరమైన మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సదుపాయం, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థినీ విద్యార్థులకు విద్యా బోధనలు అందించాలని అదే విధంగా వారిని దత్తత తీసుకొని వారి అభ్యసన స్థాయిలను మెరుగు పడే%శీ%దుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని విద్యాసంస్థలలో అత్యుత్తమమైన బోధనలు అందించడానికి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సబ్జెక్టుల వారిగా అర్థమయ్యే రీతిలో బోధించాలని, విద్యార్థి యొక్క చదువు, వ్యక్తిగత విషయాలపై దృష్టి పెట్టాలని, వారి హాజరు శాతాన్ని వంద శాతం వచ్చే వరకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని,వారి యొక్క మేధస్సును వెలికి తీసేందుకు నూతన ఆవిష్కరణలకు వారిని ప్రేరేపించాలని, ప్రతి సబ్జెక్టులో పిల్లలు పట్టు సాధించేందుకు పక్కా ప్రణాళికతో ప్రధానోపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు, విద్యతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక స్థితిగతులపై ప్రత్యేక తరగతులు డిఎం అండ్ హెచ్ఓ సహకారంతో నిర్వహించాలని, సూచించారు.పిల్లలు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేందుకు కృషి చేయాలని షెడ్యూలు ప్రకారం పేరెంట్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా వంట సిబ్బంది భోజనాలు సిద్ధం చేయాలని,స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిరంతరం విద్యుత్తు సదుపాయం ఉండేలా చూసుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆర్ బి ఎస్ కే క్యాంపులు నిర్వహించాలని సూచించారు.సమాజానికి భావి భారత పౌరులను అందించే మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. మండలాల ప్రత్యేక అధికారులను అన్ని పాఠశాలలు,వసతి గృహాలలో అందిస్తున్న సేవలపై నిత్యం సమీక్షలు, తనిఖీలు చేయడం జరుగుతుందని అన్నారు,ఈ సమావేశంలో ఎంఈఓ లు ప్రోగ్రాం ఆఫీసర్స్ అప్పారావు, చంద్రశేఖర్ ఆజాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు

**మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలపై హరీశ్ రావు**



హైదరాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలపై ఎక్స్ వేదికగా హరీశ్ రావు తొలిసారి స్పందించారు. తెలంగాణ ప్రజలు ముంబయి, షోలాపూర్, పూణే, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తున్నారని, కాంగ్రెస్ మోసాలు విరివిగా మహారాష్ట్రలో ప్రచారం అయ్యాయని హరీశ్ రావు అన్నారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులు కాంగ్రెస్ అబద్ధపు హామీలపై అక్కడ ప్రచారం చేశారని చెప్పారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమిని చవిచూసిందని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.ఐదు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన గారడీని ఆ రాష్ట్ర ప్రజలు నమ్మలేదని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని ఈ ఎన్నికల ద్వారా తేలిందని మాజీ మంత్రి అన్నారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని హరీశ్ రావు అన్నారు. ఇక్కడ పథకాలు అమలు చేయకుండా మహారాష్ట్రలో రూ.3వేలు ఇస్తామనడాన్ని ఆ రాష్ట్ర ప్రజలు గమనించారని ఆయన చెప్పుకొచ్చారు. రైతు భరోసా ఎగ్గొట్టారని, ఆసరా ఫించన్లను సైతం పక్కన పెట్టేశారని ఆయన చెప్పారు. రైతు రుణమాఫీ ఏడాది గడుస్తున్నా పూర్తి చేయకపోవడం వంటి అంశాలను మహా ప్రజలు గమనించారని ఆయన తెలిపారు. ఈ అంశాలన్నీ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌పై తీవ్ర ప్రభావం చూపెట్టాయని హరీశ్ రావు అన్నారు. అలాగే జార్ఖండ్ ఎన్నికలపైనా మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై బీజేపీ పార్టీ అక్రమ కేసులు పెట్టిందని, ఆయన్ని అరెస్టు చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. అలాగే హేమంత్ సోరెన్ పార్టీని సైతం చీల్చేందుకు కుట్రలు చేసిందని ధ్వజమెత్తారు. దీన్ని గమనించిన జార్ఖండ్ ప్రజలు ఎన్నికల్లో బీజేపీని ఓడించారని ఆయన చెప్పారు. బీజేపీ కక్షసాధింపు విధానాలని ప్రజలు హర్షించడం లేదని తేలిపోయిందని అన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో అనేక ప్రజా సంక్షేమ పథకాలు



**సంబరాలలో బిజెపి కార్యకర్తలు**

**మహబూబాబాద్/కొత్తగూడ, నవంబర్ 23 (డైలీ రిపోర్ట్):** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించిన భారతీయ జనతాపార్టీ కూటమి ఈ సందర్భంగా కొత్తగూడ భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. మహారాష్ట్ర ఎన్నికల లెక్కింపు అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ ఎన్డిఏ కూటమి విజయ దుందుభి మోగించి 227 స్థానాల్లో చారిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేయనైనది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు యాదగిరి మురళి మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నిక ఎక్కడైనా బిజేపి గెలుపే లక్ష్యంగా నరేంద్రమోడీ పరిపాలనను ఆకాంక్షిస్తూ విజయాలను అందిస్తున్నందున రాబోవు రోజుల్లో తెలంగాణలో కూడా బిజేపి అధికారం దిశగా ముందుకు పోతున్నందున రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కూడా గెలిపించాలని ప్రజలను కోరుచూ బిజేపి తెలంగాణలో అధికారం చేపడితే డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల అనేక ప్రజా సంక్షేమ పథకాలు అభివృద్ధి,విద్య,ఉపాధి మౌలిక సదుపాయాల కల్పన నేరుగా జరిగి తెలంగాణ అభివృద్ధి చెందుతుంది కావున గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోడీ వికసిత భారత్ లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకు పోతున్నందున మనం సైతం బిజేపికి మద్దతుగా నిలవాలని కోరుతూ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పొడిశెట్టి రవీందర్, బీజేపీ గిరిజన మోర్చా వనభందు సెల్ రాష్ట్ర కన్వీనర్ బోడ నవీన్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు తోటకూరి మధు, బోనాల ప్రవీణ్ చారి, సీనియర్ నాయకులు గుగులోత్ స్వామి నాయక్, మండల ఉపాధ్యక్షులు చెవ్వ రాంచందర్, మండల ఉపాధ్యక్షులు వజ్జ రవి,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంగాపురం బిక్షపతి,సీనియర్ నాయకులు కుండే శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మామిడి యాకయ్య,మెరుగు నాగరాజు,బూత్ అధ్యక్షులు కుమార్,నరేష్,బోడ సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707